
సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024





ఈత.. గుండెకోత

సరదాకు ఈతకు వెళ్లి నీటి ప్రవాహానికి గల్లంతై విగతజీవులుగా మారుతున్నారు. కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు.

వివరాలు 8లో ►



సొంత భవనం నిర్మించేనా?

బొల్లారం మున్సిపాలిటీ కార్యాలయానికి సొంత భవనం కరువైంది. తాత్కాలిక భవనంలో కొనసాగుతోంది. వివరాలు 9లో ►

న్యూస్‌రీల్

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఓ రమేష్ కుమార్

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని యూసుఫ్‌పూర్ గ్రామ శివారులో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వం కూలీ రేటును రూ.272 నుంచి రూ.300కు పెంచిందన్నారు. సాంకేతిక సహాయకులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసి డబ్బు పొందాలన్నారు. వ్యవసాయ పనులు పూర్తవుతున్న నేపథ్యంలో కూలీల సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్ తదితరులు ఉన్నారు.

అందరినీ కలుపుకుపోతా



కాంగ్రెస్ నాయకులతో నీలం మధు

జిన్నారం (పటాన్‌చెరు): అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడే పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్తను కలుపుకుని ముందుకు సాగుతానని ఆ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. సోమవారం జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని నాయకులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించారు. కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డి, రాములు, బాలసుబ్రహ్మణ్యం, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నేరాల కట్టడికి సైబర్ వారియర్స్



సిమ్‌కార్డులు అందిస్తున్న ఎస్పీ రూపేష్


సంగారెడ్డి: నేరాల కట్టడికి సైబర్ వారియర్స్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. సోమవారం సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, అదనపు డీజీపీ శిఖా గోయల్ ఆధ్వర్యంలో జిల్లాలోని సిబ్బందికి ఫోన్లు, సిమ్ కార్డులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతీ పోలీస్ స్టేషన్లలో సైబర్ వారియర్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. సైబర్ నేరాలకు గురైన వ్యక్తులు 1930కి కాల్ చేయడం కానీ, ఎన్సీఆర్పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. 1930 కాల్ చేసిన వెంటనే ఆ ఏరియాలోని సైబర్ వారియర్‌కు సులువుగా ఫోన్ కనెక్ట్ అయి అప్లికేషన్ స్టేటస్ తెలుసుకోవడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి సైబర్ సెల్ ఇన్‌చార్జి డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండపాకకు సాగునీరు

కొండపాక(గజ్వేల్): తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి సాగు నీరు చేరడంతో సోమవారం కాంగ్రెస్ నాయకులు గోదారమ్మ తల్లికి పూజలు చేసి స్వాగతం పలికారు. రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ప్రకారం కాలువ ద్వారా గోదావరీ జలాలు చెరువులకు చేరేందుకు కాలువల్లో మట్టి, పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో నీరు చేయడానికి తీవ్ర ఆలస్యం జరుగుతోంది. దీంతో నాయకులు సొంత ఖర్చులతో జేసీబీ సహాయంతో కాలువలో మట్టిని, పిచ్చి మొక్కలను తొలగించారు.

కాంగ్రెస్‌లో చేరికల చిచ్చు

- కబ్జాలు, మట్టి, బియ్యం దందాలు చేసిన వారిని ఎలా చేర్చుకుంటారంటున్న క్యాడర్
- అక్రమార్కులతో కలిసి ఎలా పనిచేయాలని ప్రశ్న



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటూ.. ఏకంగా పోలీస్‌కేసు నమోదైన శివంపేట్ మండలానికి చెందిన ఓ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధి ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇన్నాళ్లు ఈ కబ్జాలపై పోరాటం చేసిన కాంగ్రెస్ నాయకులు ఈ చేరికలను వ్యతిరేకిస్తున్నారు. కబ్జాలకు పాల్పడిన వారిని పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నిస్తున్నారు.

➡ నర్సాపూర్‌కు చెందిన ఓ వ్యాపారి బీఆర్‌ఎస్‌లో ఉంటూ సుమారు రూ.90 కోట్ల వరకు ప్రభుత్వ బియ్యాన్ని అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నాడు. ఈయన ఆస్తులను కూడా ఇటీవల అధికారులు వేలం వేశారు. క్రిమినల్ కేసులు నమోదై జైలుకు కూడా వెళ్లి వచ్చారు. తీరా ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హస్తం గూటికి చేరేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో నర్సాపూర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు.

➡ కౌడిపల్లి, నర్సాపూర్, చిలిపిచేడ్, తదితర మండలాల్లో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు ఇన్నాళ్లు చెరువుల్లో విచ్చలవిడిగా మట్టి, మొరం దందాలకు పాల్పడి రూ.కోట్లు వెనుకేసుకున్నారు. అప్పట్లో అధికారాన్ని అడ్డంపెట్టుకుని విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడారు. వీరంతా ఇప్పుడు కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ అక్రమ దందాలకు పాల్పడిన నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని, ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న క్యాడర్ తేల్చి చెబుతోంది.

క్యాడర్ వ్యతిరేకత

అధికార కాంగ్రెస్ పార్టీలో చేరికల చిచ్చు రాజుకుంటోంది. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్‌లో ఉంటూ అక్రమదందాలు, భూకబ్జాలు, అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడిన నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హస్తం గూటికి చేరుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ చేరికలను పదేళ్లుగా కాంగ్రెస్ జెండాను మోసిన క్యాడర్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పలువురు బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 6న తుక్కుగూడలో నిర్వహించనున్న భారీ బహిరంగసభలో నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, మెదక్ తదితర నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, పలువురు పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. కొందరు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నాయకుల వెంట తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్ నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తుండటం హస్తం పార్టీలో కలకలం రేపుతోంది. పదేళ్లుగా ఈ అక్రమార్కులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన తాము ఇప్పుడు వారు కాంగ్రెస్‌లోకి వస్తే ఎలా కలిసి పనిచేయాలని ప్రశ్నిస్తున్నారు. వారంతా ఆర్థిక, అంగబలాన్ని ఉపయోగించి రానున్న రోజుల్లో తమపై ఆధిపత్యం చెలాయిస్తారనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జెండా మోసిన కార్యకర్తలకు అండగా..

దశాబ్ద కాలంగా కాంగ్రెస్ జెండాను మోసిన కార్యకర్తలకు పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని పార్టీలో చేర్చుకునేందుకు రాష్ట్ర అధినాయకత్వం కూడా ఒప్పుకోదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరేందుకు ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి పార్టీలో స్థానం ఉండదు.

– ఎస్.ఆంజనేయులుగౌడ్, డీసీసీ అధ్యక్షుడు

మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ



బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసింది

మంత్రి దామోదర రాజనర్సింహ

జహీరాబాద్: ప్రజలు ఒక కుటుంబానికి, ప్రాంతీయ పార్టీకి పాలన అందిస్తే వారు రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శించారు. సోమవారం జహీరాబాద్‌లో మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఇఫ్తార్ విందు, పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో బీఆర్‌ఎస్ అప్పులే మిగిల్చిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలతోనే రాష్ట్రం సాకారమైందన్నారు. కుటుంబ అహంకారానికి ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పారన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే సత్తా, ధైర్యం ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. 4,900 నర్సింగ్ ఆఫీసర్లను నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. సబ్‌ప్లాన్ తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించింది తమ ప్రభుత్వమే అన్నారు. తెలంగాణకు మొదటి శాపం ధరణి అని, రెండో శాపం 317 జీఓ అని, మరో శాపం 46వ జీఓ అన్నారు. లింగాయత్ సమాజాన్ని బీసీలుగా గుర్తించింది ఆనాటి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అని గుర్తు చేశారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కూడ ఆయనకే దక్కిందన్నారు. జహీరాబాద్ ప్రాంత చెరకు రైతులను కాపాడుకున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతులకు రావాల్సిన రూ.7.50 కోట్ల బకాయిలను ఇప్పించామన్నారు. నిమ్జ్ ప్రాజెక్టుకు న్యాయం చేస్తామన్నారు. జాతీయ స్థాయిలో లింగాయత్‌లను ఓబీసీలుగా గుర్తించేందుకు గాను ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కార్‌తో పాటు తాను కృషి చేస్తానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా సురేష్‌శెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, టీఎస్‌ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ శెట్కార్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మదన్‌మోహన్‌రావు, ఎస్.ఉజ్వల్‌రెడ్డి పాల్గొన్నారు.

3 నుంచి ఓటర్ చైతన్య కార్యక్రమాలు

కలెక్టర్ వల్లూరి క్రాంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఈ నెల 3వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నియోజకవర్గ, మండల అధికారులతో ఎన్నికల నోడల్ స్వీప్ కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, స్వీప్ నోడల్ అధికారి జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్త..

వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎండలో చిన్నపిల్లలు, వృద్ధులను బయటకు పంపకూడదని చెప్పారు. ఉపాధి హామీ కూలీలు 12 గంటలలోపే పని పూర్తి చేయాలని, పరిశ్రమలు సినిమా హాల్స్‌లో కాంప్లెక్స్‌లలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో మిషన్ భగీరథ తాగునీటి కనెక్షన్లు ఏర్పాటు చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ బడుల్లో కనీసం వసతులు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

సంగారెడ్డి టౌన్: నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచామని చెప్పారు. సమావేశంలో టీసీఎస్‌ఓ వనజ, టీఆర్డీఓ జ్యోతి, డీపీఓ సాయిబాబా, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకూ కొంటాం

అడిషనల్ కలెక్టర్ మాధురి



కందిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ మాధురి

కంది(సంగారెడ్డి): రైతులు దళారులను ఆశ్రయించకుండా వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అడిషనల్ కలెక్టర్ మాధురి సూచించారు. సోమవారం కందిలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ ఆఖరు వరకు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆఖరు గింజ వరకు వరిని కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. ధాన్యాన్ని ఎండబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని సూచించారు. ఏ గ్రేడ్‌కు రూ.2 వేలు, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.1980 చెల్లించడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో 40 కిలోల బస్తాకు 600 గ్రాములు మాత్రమే తరుగు తీయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వనజ, డీసీఓ తుమ్మ ప్రసాద్, సీఈఓ శ్రీధర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల నిర్వహణలో ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు కీలకమని అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పీఓ, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 499 మంది పాల్గొనాల్సి ఉండగా.. 30 మంది గైరాజరయ్యారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దేవుజా, పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు, ట్రైనింగ్ ఇన్‌చార్జి తహసీల్దార్ భిక్షపతి, ఎన్నికల డీటీ సంతోష్, మాస్టర్ ట్రైనర్లు అమరేందర్ రెడ్డి, చంద్రారెడ్డి, యోగిబాబు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేస్తాం.. వరికి బోనస్ ఇస్తాం

కోహెడ(హుస్నాబాద్): లోక్‌సభ ఎన్నికల తరువాత రైతులకు రుణమాఫీ చేస్తామని, వరికి బోనస్ ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజా శ్రేయస్సే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సోమ వారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. తీవ్ర ఎండలతో భూగర్భజలాలు అడుగంటిపోతే.. కాంగ్రెస్‌తోనే కరువచ్చిందని మాజీ సీఎం కేసీఆర్ అనడం సరికాదన్నారు. తాగు నీటి సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని కార్యకర్తలకు సూచించారు. జూన్ లో స్కూళ్ల పునఃప్రారంభానికి ముందే మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కోహెడకు అందుబాటులో ఉన్న ప్రాజెక్టు నుంచి సాగు నీరు రావడానికి అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. జనాభ ప్రాతిపదికన ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు.

కాంగ్రెస్ విధానాలను తిప్పి కొట్టాలి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): కాంగ్రెస్ వంద రోజుల పాలనలో ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎంపీ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డితో పాటు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రుణమాఫీ ఏమైందని.. కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఎప్పుడు ఇస్తారని, రైతుబంధు రూ 15 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ 2500 హామీలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో కలెక్టర్‌గా 11 ఏళ్ల ప్రజలకు సేవ చేసే అదృష్టం కలిగించినందుకు జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సమస్యలపై అవగాహన ఉందని, ఐఏఎస్ అధికారుల పరిచయాలతో కేంద్ర ప్రభుత్వం ద్వారా అధిక నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. జిల్లాలో విద్యార్థుల కోసం ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసి 100 కోట్ల నిధులను కేటాయిస్తానని, అదేవిధంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఫంక్షన్ హాల్ నిర్మించి, నిరుపేద ప్రజలకు పెళ్ళిలు చేసేందుకు ఉచితంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, నరహరిరెడ్డి, బుచ్చిరెడ్డి, రాజేశ్వరరావు దేశ్పాండే, విఠల్, గోవర్ధన్ రెడ్డి, నగేష్, మల్లేశం, బుచ్చిరెడ్డి, మల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్ని చెరబట్టారు

- జేసీబీలతో తవ్వేస్తున్న అక్రమార్కులు
- ఖేడ్‌లో భారీగా మట్టి దందా
- రూ.2 వేలకు ట్రాక్టర్ చొప్పున అమ్మకం
- అధికారుల అండదండలతో వ్యాపారం



లింగాపూర్ చెరువులో మట్టి తవ్వకాలు

నారాయణఖేడ్: అక్రమార్కులు చెరువులను చెరబట్టారు.. ఇష్టానుసారంగా చెరువుల్లోకి జేసీబీలు దించి నల్లమట్టిని తోడేస్తున్నారు. అక్రమానికి కాదేదీ అనర్హం అన్న చందంగా అక్రమ వ్యాపారానికి తెరలేపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెరువుల్లోంచి నల్లమట్టి తవ్వి విక్రయించే వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని పలు చెరువుల్లో ఈ అక్రమ కార్యలాపాలు జోరుగా జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని లింగాపూర్, గంగాపూర్‌తోపాటు పలు చెరువుల్లో జేసీబీలను ఏర్పాటు చేసి భారీగా నల్లమట్టిని తవ్వేస్తున్నారు. జేసీబీలను ఏర్పాటు చేసి చెరువుల్లో మట్టి తవ్వడం నిషేధం. చెరువుల్లో మట్టి తవ్వకాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ఒక వేళ ప్రభుత్వం పూడిక మట్టి తొలగింపునకు అనుమతులు ఇచ్చినా కేవలం రైతులు నిర్దేశిత మేర తామే మట్టిని గడ్డపారలతో తవ్వి ఎడ్ల బండ్లపై తరలించుకోవాలి. కానీ ప్రభుత్వం ఇందుకు కూడా అనుమతి ఇవ్వలేదు. వేసవి కాలం ప్రారంభం కావడంతో వేసవి దుక్కులు దున్నుకునేందుకు సిద్ధమైన రైతులకు కొందరు వ్యాపారులు జేసీబీలు, ట్రాక్టర్లను భారీ సంఖ్యలో మోహరించి మట్టిని యథేచ్ఛగా తవ్వేసి విక్రయిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.1,500 నుంచి రూ.2000 వరకు అమ్ముకుంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్ల ట్రిప్పుల మట్టిని తవ్వేస్తున్నారు. మట్టిని తవ్వి నిత్యం లక్షల రూపాయిలు పోగేసుకుంటున్నారు. భారీ బావుల్లాంటి గోతులను చెరువుల్లో తవ్వి సారవంతమైన మట్టిని తోడి తరలిస్తున్నారు. ఇలా మట్టి తోడడంతో చెరువు కట్టలకు ప్రమాదం ఏర్పడే ఆస్కారం ఉందని ఆయా గ్రామాల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు చెరువుల్లో భారీ గోతులు ఏర్పడడంతో పిల్లలు ఈతలకు వెళ్ళిన సందర్భాల్లో, లేదా జాలర్లు చేపల వేటకు, పశువుల కాపర్లు తమ పశువులను తీసుకెళ్ళి నీటిని తాపించే సందర్భాల్లో గోతుల్లో నిలిచే నీరు వల్ల ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే ఆస్కారం ఉంది. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు నుంచే ట్రాక్టర్లు వెళుతున్నా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. మట్టి అక్రమంగా తరలిస్తున్న విషయం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వ్యాపారులకు వంతపాడుతున్నారని పేర్కొంటున్నారు. మట్టి తవ్వి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వ్యాపారులు, జేసీబీల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. నల్లవాగు ప్రాజెక్టులో సైతం వారం క్రితం ఇలాగే భారీగా జేసీబీలను ఏర్పాటు చేసి నల్లమట్టిని తవ్వి విక్రయాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు పలు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని వదిలేశారు. అధికారుల అండదండలతోనే నల్లమట్టి వ్యాపారం సాగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.

కేసు నమోదు చేస్తాం: ఈఈ

చెరువుల్లోంచి మట్టి అక్రమంగా తరలిస్తున్న విషయంపై నీటిపారుదల శాఖ ఈఈ భీం వద్ద ప్రస్తావించగా.. అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. చెరువుల్లో మట్టి తవ్వేందుకు ఎలాంటి అనుమతులు లేవని అన్నారు. అక్రమార్కులు ఎక్కడైనా మట్టి తవ్వకాలు చేపడితే ఫిర్యా దు చేయాలని పేర్కొన్నారు. మట్టి తవ్వకంపై తహశీల్దార్, ఆర్డీఓను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

జహీరాబాద్‌లో బీజేపీదే గెలుపు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

జోగిపేట (అందోల్): కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని జహీరాబాద్ లోక్‌సభ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం అందోల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో బీజేపీ ఎక్కడుందని మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో పార్టీ సత్తా ఏంటో చూపిస్తామన్నారు.

మరోసారి గెలిపించండి

దేశాభివృద్ధిలో భాగస్వాములం కావాలంటే బీజేపీని మరోసారి గెలిపించాలని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. రెండు సార్లు ఎంపీగా పనిచేసే అవకాశం కల్పించిన లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. మరోసారి అవకాశం ఇస్తే మిగిలి ఉన్న పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వట్‌పల్లి, అల్లాదుర్గం, టేక్మాల్, పుల్కల్, అందోలు మండలాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మణ్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, అనంతరావు కులకర్ణి, చంద్రశేఖర్, రమేష్‌బస్వరాజ్, మహిపాల్‌రెడ్డి, పల్వట్ల జగదీశ్వర్, జగన్నాథం, శంకర్, ప్రభాత్, శ్యామాగౌడ్, సుమన్, శివచందర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

నారాయణఖేడ్: అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని లోక్‌సభ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. సోమవారం పట్టణంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో నియోజకవర్గ పరిధిలో రూ.350 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేయించానని తెలిపారు. సంగారెడ్డి, నాందేడ్, అకోలా జాతీయ రహదారి విస్తరణకు రూ.513 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. అనంతరం కొత్తపల్లి, పోతన్‌పల్లి మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, రాములు, 50 మంది నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బద్దం మహిపాల్ రెడ్డి, రవికుమార్ గౌడ్, సంగప్ప, విజయపాల్ రెడ్డి, అమర్ సింగ్ పవార్, రజినీకాంత్ పాల్గొన్నారు.

ఈత.. గుండెకోత



మిరుదొడ్డి అల్వాల శివారులోని కూడవెల్లి చెక్ డ్యాం

సరదాగా ఈతకు, చేపలు పట్టేందుకు వెళ్తున్నారు. అనుకోని రీతిలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి గల్లంతై విగతజీవులవుతున్నారు. ఈవిధంగా ప్రాణాలు కోల్పోయి కన్నవారికి కడుపుకోతను మిగుల్చుతున్నారు. ప్రస్తుతం కూడవెల్లి వాగులోకి మల్లన్న సాగర్ గోదావరి జలాలు విడుదల చేస్తున్నారు. దీంతో ఈ పరిసర ప్రాంతాల్లో సరైన పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయకపోవడం, రక్షణ చర్యలు చేపట్టే నాథుడు కానరావడం లేదు. అయితే వాగులోకి దిగిన వారు ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యు వాత పడుతున్నారు. కాగా, వాగులు, వంకలు, చెరువులు, కుటల వద్దకు వెళ్లనివ్వకుండా ఉండేందుకు గాను పోలీసులు.. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

ఇటీవల పెరిగిన ప్రమాదాలు

- కూడవెల్లి వాగు, అల్వాల్ చెక్‌డ్యాం వద్ద జరపైలం
- వాగుల్లో దిగి ప్రాణాలు కోల్పోతున్న వైనం
- కన్నవారికి కడుపు కోత మిగుల్చుతున్న ఘటనలు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రస్తుతం కూడవెల్లి వాగులోకి మల్లన్న సాగర్ గోదావరి జలాలు విడుదల చేస్తున్నారు. సుమారు 53 కిలో మీటర్ల పొడవు ఉండే కూడవెల్లి వాగుపై అక్కడక్కడ 28 చెక్ డ్యాంలు న్నాయి. వాగులోకి దిగిన వారు ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడుతున్నారు.

అత్తారింటికి వచ్చి మృత్యుఒడికి..

ఏడాదిన్నర క్రితం మిరుదొడ్డిలో జరుగుతున్న ఓ పండుగ కోసం నిజామాబాద్ జిల్లా వాసి అశోక్ (38) అత్తారింటికి వచ్చి సరదాగా కూడవెల్లి వాగు చెక్ డ్యాంలో ఈత కొడుతూ నీట మునిగి మృతిచెందాడు. గతేడాది క్రితం అల్వాల పాత బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న వాగును దాటాలని చూసిన ఓ గుర్తు తెలియని వ్యక్తి వరదలో కొట్టుకు పోయి గల్లంతయ్యాడు. 20 రోజుల తర్వాత శవమై దొరికాడు.

మిత్రులతో కలిసి ఈత కొడుతూ..

కూడవెల్లి వాగులో మిరుదొడ్డికి చెందిన మల్కపురం నర్సింహులు రాజమణి దంపతుల కొడుకు నరేష్ (19) మిత్రులతో కలిసి వాగులో దిగి ఈత కొడుతూ ఊపిరాడక నీట మునిగి మృతి చెందాడు.

దైవదర్శనానికి వచ్చి ఒకరు.. ఇద్దరు మత్స్యకారులు సైతం

మాఘ అమావాస్య సందర్భంగా ఫిబ్రవరి నెల 9న దైవ దర్శనం చేసుకోవడానికి వాగు దాటాల్సి ఉండగా.. దాటుతున్న క్రమంలో మిరుదొడ్డికి చెందిన మద్దెల స్వామి (41) నీటి ఉధృతికి కొట్టుకు పోయాడు. గల్లంతైన మూడు రోజుల తర్వాత శవమై తేలాడు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి వాగులో ఇటీవల చేపలు పట్టబోయి ఇద్దరు మత్స్యకారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు.

డేంజర్‌గా మారిన చెక్ డ్యాం

అల్వాల శివారులో ఉన్న కోదండరాముడి ఆలయాన్ని ఆనుకుని ఉన్న చెక్ డ్యాంలో నిలిచి ఉన్న నీరు ప్రతి ఒక్కరినీ కట్టిపడేస్తుంది. చుట్టూ చెట్టూ చేమలతో నిండి ఉంటుంది. అందరూ ఇక్కడ స్నానం చేసేందుకు ఉవ్విళ్లురుతుంటారు. దీంతో అక్కడ ఏం జరుగుతుందో ఏమో తెలియదు. కానీ ఎక్కువ శాతం ఈత వచ్చిన వారే మృత్యువాత పడ్డారు. ఈ ఒక్క చెక్ డ్యాంలోనే ఇప్పటి వరకు ఐదుగురు మృత్యువాత పడ్డారు.

మిరుదొడ్డి-అల్వాల.. చెక్ డ్యాం..

మిరుదొడ్డి- అల్వాల శివారులో ఉన్న కోదండరాముడి ఆలయాన్ని ఆనుకొని ఉన్న చెక్ డ్యాంలో సరదాగా ఈతకు వెళ్లిన వారు తిరిగి రాని లోకాలకు వెళుతున్నారు. దీంతో కన్న వారు కడుపుకోతకు గురవుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం మల్లన్న సాగర్ నిర్మాణంలో ఇంజినీరింగ్‌గా పని చేస్తున్న నల్లగొండ వాసి మల్లికార్జున్ (48) మిరుదొడ్డి-అల్వాల చెక్ డ్యాంలో ఈత కొడుతూ నీట మునిగి మృతిచెందాడు.

ముందస్తు ఏర్పాట్లు లేక

ఇన్ని సంఘటనలు జరుగుతున్నా ఎలాంటి రక్షణ లేకుండా ఉన్న కూడవెల్లి వాగు సరిసర ప్రాంతాల్లో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోక పోవడంపై జనాలు మండిపడుతున్నారు. నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో చెక్ పోస్టులు పెట్టాలని నిబంధనలు కానరావడం లేదని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్వాల శివారులో ప్రతి ఏడాది జరిగే జాతర సమయంలో వాగు ఉధృతంగా పారుతుండటంతోపాటు దాన్ని దాటి జాతరకు వెళ్లే క్రమంలో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలుస్తోంది.

చెట్టంత కొడుకుని పోగొట్టుకున్నా



చేతికందిన చెట్టంత కొడుకుని పోగొట్టుకున్నాం. మా కుమారుడు నరేష్ సరదాగా దోస్తులతోని అల్వాల చెక్ డ్యాంల ఈత కోసం వెళ్లాడు. ఈత వచ్చిన కొడుకు నీటిలో మునిగి గల్లంతై శవమై తేలిండు. మాకు మాత్రం పుత్ర శోకమే మిగిలింది.

– మల్కపురం నర్సింహులు, మిరుదొడ్డి

అవగాహన కల్పిస్తున్నాం



వేసవిలో చిన్నారులు, ఈత రాని యువకులు సైతం వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. విద్యార్థులు, చిన్నారులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించి వాగులు, చెరువులు, కుంటల వద్ద ఈతకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో బైక్‌లు ఇవ్వొద్దు. ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు కలిసి ఈత కోసం వాగులను ఆశ్రయించే అవకాశాలున్నాయి. దీంతో ఈత రాకుంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం లేకపోలేదు. పీఎస్ పరిధిలోని వాగు పరిసర ప్రాంతాల్లో పోలీస్ పికెట్లతో పర్యవేక్షిస్తాం.

– బోయిని పర్శరామ్, ఎస్‌ఐ మిరుదొడ్డి

క్లుప్తంగా

పకడ్బందీగా ఉన్నతి

సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్



కేజీబీవీ పాఠశాలలో రమేష్

సదాశివపేట(సంగారెడ్డి): ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యాసన ఫలితాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ఉన్నతి కార్యక్రమం అమలు చేస్తోందని రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నతి కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినులు నేర్చుకున్న దానిని బోర్డుపై రాసి చూపించాలని సూచించగా ఓ విద్యార్థిని చక్కగా రాయడంతో అభినందించారు. ఉపాధ్యాయులు బాగా బోధించి వందశాతం ఫలితాలు తీసుకు రావాలని ఆదేశించారు. అనంతరం నిజాంపూర్ ఉన్నత పాఠశాలను సందర్శించి హరితహారం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. పదవీ విరమణ పొందిన రుద్రప్పను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశం, సీఎంఓ వెంకటేశం, ఏఎంఓ అనురాధ, డీసీసీబీ సెక్రటరీ లింబాజీ, ఎంఈఓ అంజయ్య పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

దుబ్బాకరూరల్: ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని గంభీర్‌పూర్‌లో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగిలి పల్లి ఎల్లవ్వ.. ఇంటికి తాళం వేసి రెండు రోజుల క్రితం కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం కాసపురంలో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లింది. సోమవారం తెల్లవారుజాము ఇంటి లోపల నుంచి మంటలొచ్చాయి. చుట్టు పక్కల వారు గమనించి ఫైరింజిన్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బందొచ్చి మంటలు అదుపులోకి తెచ్చింది. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కాగా, రూ.25 వేలు నగదు, దుస్తులు, నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.8 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. సంఘటన స్థలానికి ఎస్‌ఐ గంగరాజ్ చేరుకుని పరిశీలించారు.

గాయపడ్డ కూలీ..

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని గాంధీనగర్‌లో శనివారం బైక్ ఢీకొట్టిన సంఘటనలో నంగునూరి రంగయ్య(60) దినసరి కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించి ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స అందించారు. తలకు తీవ్రగాయాలు కావడంతో కోమాలోకి వెళ్లిన రంగయ్య సోమవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న సంబాజి దత్తాత్రేయ నల్కర్

పంట మార్పిడి తప్పనిసరి

కేవీకే శాస్త్రవేత్త దత్తాత్రేయ నల్కర్

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు కేవలం వరి పంట మాత్రమే కాకుండా అన్ని రకాల పంటలను సాగు చేయాలని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ సంబాజి దత్తాత్రేయ నల్కర్ తెలిపారు. సోమవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డీ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సాంకేతిక వారోత్సవాల్లో భాగంగా ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా దళిత రైతులకు సేంద్రియ సాగు, అధిక దిగుబడులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కేవలం ఒకే రకం పంటను సాగు చేస్తున్నారని ఇది సరికాదన్నారు. వరితో పాటు కూరగాయాలు, పప్పుధాన్యాలు, పండ్లు ఇతర పంటలతో పాటు పశుపోషణ, పాడి అభివృద్ధి చేసుకోవాలన్నారు. దీంతో ఒక పంటలో నష్టం వచ్చిన మిగతా వాటిల్లో లాభాలు రావడంతో రైతుకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం ప్రోగ్రాం కోఆర్డినేటర్, హార్టికల్చర్ శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేస్తే తక్కువ కాలంలో అధిక దిగుబడి వస్తుందన్నారు. సాధారణ పద్ధతిలో ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తే అధిక సాంద్రత పద్ధతిలో 14 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. పంటల మార్పిడి చేయాలన్నారు. అనంతరం రైతులకు క్షేత్రస్థాయిలో వర్మికం పోస్ట్ ఎరువు తయారీ, సేంద్రియ ఎరువులు, చీడపీడల నివారణకు కషాయాల తయారీని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవికుమార్, ఉదయ్‌కుమార్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న లారీ

- క్యాబిన్‌లో ఇరుక్కొని డ్రైవర్ విలవిల
- పగులగొట్టి బయటికి తీసిన పోలీసులు, స్థానికులు



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్

అల్లాదుర్గం(మెదక్): 161 జాతీయ రహదారిపై పంక్చరైన కంటైనర్‌ను వెనుక నుంచి అతివేగంగా లారీ ఢీకొనడంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న చిల్వెర గ్రామం వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. అల్లాదుర్గం నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న కంటైనర్ చిల్వెర శివారులో టైర్ పంక్చర్ కావడంతో రోడ్డుపై ఆపారు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ.. ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ విజయ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి వారు క్యాబిన్ విరగ్గొట్టి డ్రైవర్‌ను బయటకు తీశారు. క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్స్‌లో జోగిపేట ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో జోగిపేట వైపు వెళ్తున్న బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ ఆగి సంఘటన వివరాలు తెలుసుకున్నారు.

కుళ్లిన మృతదేహం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: కుళ్లిపోయిన స్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో ఉన్న వెంకటేష్ పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం ఉదయం ఒక పశువుల కాపరి గుర్తించాడు. వెంటనే పంచాయతీ కారోబార్ శ్రీశైలానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇక్కడి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా.. బాగా కుళ్లిపోయింది. మృతుడి వయసు 35 నుంచి 45 మధ్య ఉంటుందని పోలీసులు చెప్పారు. శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని వారు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించిన యువతి దక్కలేదని...

యువకుడి ఆత్మహత్య కేసులో కొత్త కోణం

వెల్దుర్తి(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి కేసులో కొత్త కోణం వెలుగుచూసింది. ప్రేమించిన యువతి దక్కలేదని కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లుగా తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నవతగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దోమల రవి(23) ఆదివారం సాయంత్రం తన పౌల్ట్రీ షెడ్ వద్ద గల ఓ గదిలో శవమై కనిపించాడు. మొదట కుటుంబసభ్యులు అనుమానాస్పద స్థితిలో మృతిగా భావించారు. అయితే సోమవారం అతడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి తండ్రి పుండరికం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను ప్రేమించిన యువతికి నిశ్చితార్థం కావడంతో మనస్తాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడి...

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సోమేశ్వరి కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ము మారుతీ హిల్స్‌కు చెందిన అశోక్ తన వివాహ విషయమై తానుండే రెండో అంతస్తు డేకరేషన్ చేసే కాంట్రాక్టు.. ఈవెంట్స్ ఆర్గనైజర్ విజయ్‌తో కుదుర్చుకున్నాడు. గతనెల 31వ తేదీ రాత్రి విజయ్, చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన తరుణ్ (21) అలంకరణ పనులు చేసేందుకు ఇక్కడికి వచ్చారు. ఇనుప ఫ్రేమ్‌ను కింది నుంచి రెండో అంతస్తుకు తరుణ్ తెస్తుండగా పక్కకే ఉన్న విద్యుత్ వైర్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. విజయ్, అశోక్ జాగ్రత్తలు తీసుకోలేదని వారి నిర్లక్ష్యం కారణంగానే కుమారుడు మృతిచెందాడని సోమవారం మృతుడి తండ్రి ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుగు ప్రయాణంలో అనంతలోకాలకు



మల్లమ్మ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ గృహ ప్రవేశానికి వచ్చి తిరుగు ప్రయాణంలో వృద్ధురాలు గుండెపోటుతో మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని మల్లంపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గిరిమల్ల రాజు గత నెల 30న గృహం ప్రవేశం చేశాడు. నాచారానికి చెందిన సలాడ్ మల్లమ్మ (70) శుభకార్యానికి వచ్చింది. సోమవారం తిరిగి ఇంటికి పయనమవుతుంది. కాగా మల్లంపల్లిలో బస్‌షెల్టర్ వద్ద గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

చెల్లి సంసారంపై బెంగతో ఒకరు

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు



రాజ్‌కుమార్(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): చెల్లి సంసారం నాశనమైందన్న మనోవేదనతో పురుగుల మందు తాగిన సోదరుడు మృతిచెందాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం గోవర్దనగిరిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భాషవేణి రాజ్‌కుమార్(23) మార్చి 28న హుస్నాబాద్‌లోని సిద్దిపేట రోడ్డుకు కట్టకోత మిషన్ వద్ద గుర్తుతెలియని పురుగుల మందు తాగి తన తల్లికి సమాచారం అందించాడు. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన ఇక్కడికి వచ్చి చూస్తే నోటి నుంచి నురగులు వస్తున్నాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ హాస్పిటల్‌లో చేర్పించగా ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, ఐదారు నెలల కింద రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఇచ్చి, కొంత అప్పు చేసి తన చెల్లికి హుస్నాబాద్ మండలం తోటపల్లికి చెందిన యువకుడితో వివాహం చేశారు. రెండు, మూడు నెలలపాటు సంసారం సవ్యంగా నడిచింది. ఆ తర్వాత ఆమెకు అత్తవారింట్లో వేధింపులు మొదలయ్యాయి. దీంతో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. అయితే చెల్లి సంసారం నాశనం అయ్యిందనే బెంగతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ఒడిగట్టాడని తండ్రి భాషవేణి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హుస్నాబాద్ ఎస్సై తోట మహేష్ పేర్కొన్నారు.



హుస్నాబాద్: మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేష్

హుస్నాబాద్: ఓ చెరువులో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించిన ఘటన పట్టణంలో జరిగింది. ఎస్‌ఐ మహేష్ కథనం ప్రకారం.. ఎల్లమ్మ చెరువులో సోమవారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారొచ్చి దానిని బయటికి తీయించారు. అనంతరం దర్యాప్తు చేపట్టగా మండలంలోని అంతకపేట గ్రామానికి చెందిన వైద్యం విద్యాసాగర్ (43)గా గుర్తించారు. అతను ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. వాటిని భరించలేక మనస్తాపం చెందిన అతను ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటికొచ్చాడు. మరుసటి రోజు ఉదయం ఎల్లమ్మ చెరువులో శవమై కనిపించాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలకృత్యాలకని వెళ్లి..

చెరువులో పడి వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. పట్టణ సీఐ దిలీప్‌కుమార్ కథనం ప్రకారం.. బ్రాహ్మణ విధికి చెందిన శివనూరి సత్యనారాయణ (52) బస్సు డిపో వద్ద గల స్వాగత్ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 30న తొగిటలోని తన కూతురు, మనమళ్లను చూసి వస్తానని ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి మార్చి 31న అక్కడి నుంచి మెదక్‌కు బయలుదేరాడు. కానీ సోమవారం ఇంటికి రాకపోవడంతో మృతుడి భార్య సునీత తెలిసిన వారిని వాకబు చేయగా ఎలాంటి సమాచారం లేదు. దీంతో పట్టణంలోని పిట్లం చెరువులో సత్యనారాయణ శవమై తేలినట్లు స్వాగత్ హోటల్ నిర్వాహకులు తన అల్లుడు దయాకర్‌కు తెలిపినట్లు సునీత పేర్కొన్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిండొచ్చని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై దాడులు



కల్తీ నెయ్యికి వినియోగిస్తున్న పదార్థాలను పరిశీలిస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: కల్తీ నెయ్యి తయారు చేస్తున్న కేంద్రంపై పోలీసులు దాడులు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా ఆమనగల్‌కు చెందిన ఇస్లావత్ గోవింద్ సిద్దిపేటలో నెయ్యి వ్యాపారం చేస్తున్నాడు. దోబిగల్లి పరిధిలో కొంత కాలంగా కల్తీ నెయ్యి తయారు చేసి చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్, సిబ్బందితో కలిసి వెళ్లి తయారీ కేంద్రంపై దాడులు చేశారు. ఒకరిని అదుపులో తీసుకున్నారు. కల్తీ నెయ్యి తయారీకి వినియోగిస్తున్న పదార్థాలను సీజ్ చేశారు. కాగా, వీటిని ఫుడ్ సేఫ్టీ అధికారులకు పంపించామని, రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా

ఇద్దరు అరెస్ట్

గజ్వేల్‌రూరల్: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం గజ్వేల్ సీఐ సైదా కథనం ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డు మార్గంలో గల శ్మశాన వాటిక వద్ద ఇద్దరు గంజాయి విక్రయించేందుకు వచ్చినట్లు నమ్మదగిన సమాచారంపై అడిషనల్ సీఐ ముత్యంరాజు, పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లి పుల్లూరుకు చెందిన ఒగ్గు రోహిత్, ఇదే గ్రామానికి చెందిన రామగళ్ల శ్రీమాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని స్నేహితుడి వద్ద నుంచి వారు గంజాయిని తీసుకు వచ్చి పట్టణ పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు వచ్చినట్లు తేలింది. వారి నుంచి 200 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా గంజాయి కలిగి ఉన్నా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎండల్లో తిరగవద్దు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ తదితరులు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: ప్రస్తుతం ఎండలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సోమవారం సమావేశం నిర్వహించారు. వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి వైద్యాధికారులకు వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రజలు తీవ్రమైన ఎండల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వడదెబ్బకు గురైన వారిని నీడ ప్రదేశానికి తరలించడం, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు వంటివి తాగించాలని తెలిపారు. దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. వేసవిలో ప్రజలు బయటకు వెళ్లే సమయంలో టోపీ, గొడుగు వంటివి వెంట తీసుకెళ్లాలని సూచించారు. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎండల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అనవసర ప్రయాణాలు చేయకూడదని సూచించారు. వడదెబ్బ నివారణ సమాచారం కోసం హెల్ప్‌లైన్ 63036-96647 నంబర్‌లో ఫోన్ చేయాలన్నారు. లేనిపక్షంలో దగ్గరల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. తొలుత కలెక్టర్ చేతుల మీదుగా వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించే కరపత్రాన్ని వైద్యారోగ్యశాఖ అధికారులు ఆవిష్కరించారు.

ఆడుకుంటున్న బాలుడిపై కుక్క దాడి

గాయాలు కాగా ఆస్పత్రికి తరలింపు



గాయపడిన బాలుడు

శివ్వంపేట(నర్సాపూర్): వీధి కుక్క దాడిలో బాలుడికి గాయాలైన సంఘటన శివ్వంపేటలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అల్లాపూరం అక్షిత్‌కుమార్ ఇంటి ఆరు బయట ఆడుకుంటూ ఉండగా కుక్క దాడి చేసింది. దీంతో చిన్నారి కన్నుబొమ్మల భాగంతో పాటు పలుచోట్ల గాయాలయ్యాయి. కుటుంబీకులు గమనించి వెంటనే తరిమారు. బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కలు, కోతులతో నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాటి నివారణ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.